క్లుప్తంగా

మూడు బుట్టల్లో చెత్తను సేకరించాలి



శానిటేషన్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నరసాపురం: తడి, పొడి, ప్రమాదకర చెత్తను మూడు బుట్టల్లో వేర్వేరుగా భద్రపరిచి ప్రజలు మున్సిపల్ సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సూచించారు. మంగళవారం కమిషనర్ పలు వార్డుల్లో పర్యటించి చెత్త సేకరణను పరిశీలించారు. చెత్త సేకరించే సమయంలో దగ్గర ఉండి సిబ్బందికి సూచనలు చేశారు. చెత్త సేకరణలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని చెప్పారు. ప్రజలు కూడా చెత్తను వేర్వేరుగా అందించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

శిథిలావస్థకు చేరిన మత్స్యపురి వంతెన



శిథిలమవుతున్న వంతెన భాగం

నరసాపురం: పట్టణంలోని పాలకొల్లు రోడ్డులో ఉన్న మత్స్యపురి వంతెన శిథిలమైంది. నరసాపురం నుంచి మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లే వారు ఈ వంతెన మీదుగా ప్రయాణించాలి. దీంతో ఈ వంతెనను మత్స్యపురి వంతెనగా పిలుస్తారు. అయితే ఈ వెంతన దాదాపుగా శిథిల దశకు చేరింది. ఈ వంతెనపై మూడు చోట్ల గోతులు పడ్డాయి. సైడ్‌వాల్స్ కూడా శిథిలమయ్యాయి. కానీ వంతెనకు రోడ్లు భవనాల శాఖ ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో ఈ వంతెన మీదుగా ప్రయాణించే వారు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వంతెన మరమ్మతుల్లపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న ఏఎస్ఎస్ఎం విద్యార్థులు

పాలకొల్లు సెంట్రల్: మత్తు పదార్థాలు, ధూమపానం మొదలైన చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్, డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కమిటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉంటూ మంచి నడవడికతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, ఈగల్ క్లబ్ సభ్యులు డాక్టర్ ఎం.రామకృష్ణ, ఎ.వంశీ సుబ్బరాయన్, అధ్యాపకులు డాక్టర్ యామిని, కె.భద్రాచలం తదితరులు పాల్గొన్నారు.

రామాలయ ప్రతిష్ఠాపనలో యాదాద్రి ప్రధాన అర్చకుడు



కొఠాలపర్రు రామాలయ ప్రతిష్ఠాపనలో ప్రధాన అర్చకుడు లక్ష్మీ నర్సింహాచార్యులు

పెనుగొండ: మండలంలోని కొఠాలపర్రులో సీతారామాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవంలో యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు నల్తింఘల్ లక్ష్మీ నర్సింహాచార్యులు పాల్గొన్నారు. మంగళవారం ఉత్సవంలో పాల్గొని పూజలు, అభిషేకాలు చేశారు. కొఠాలపర్రు గ్రామస్థులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం పెనుగొండలో వాసవీ ధాంలోనూ, వాసవీమాత మూలవిరాట్ ఆలయంలోనూ వాసవీ కన్యకపరమేశ్వరిని దర్శించుకున్నారు.

తెలుగు యూనివర్సిటీ పేరు మార్పు అన్యాయం



గంటారాజు

పెనుగొండ: తెలుగు భాష గౌరవాన్ని తాకట్టు పెట్టే నిర్ణయం సత్వరం వెనక్కి తీసుకోవాలని సౌత్ ఇండియా కాపు అసోషియేషన్ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు గంటా రాజు హెచ్చరించారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ తెలుగు భాష పరిరక్షణ కోసం తన ప్రాణం అర్పించిన పొట్టి శ్రీరాములు పేరు తొలగించి, తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడం అత్యంత దురదృష్టకరమన్నారు. తెలుగు భాష గౌరవాన్ని తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని కించ పరిచే చర్య అని విమర్శించారు. సత్వరం నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు.

అపరిశుభ్రంగా మున్సిపల్ పార్కులు



అధ్వాన్నంగా బీఆర్ఎంవీ హైస్కూల్ పక్కనున్న పార్కు



చెత్తతో నిండిపోయిన పాత బ్యాంక్ కాలనీ మునిసిపల్ పార్కు



ఎల్ఆర్ పేటలో సీవీ రాజు మునిసిపల్ పార్కు దుస్థితి

- విషసర్పాలకు ఆవాసంగా మారిన వైనం
- వేసవి సెలవులకైనా అభివృద్ధి చేయాలని ప్రజల డిమాండ్

పాలకొల్లు సెంట్రల్: పాలక్లొఉ పట్టణంలో ప్రజలు కాసేపు సేదతీరడానికి సరైన పార్కులు లేకుండా పోయాయి. పార్కులు ఎంత అధ్వానంగా ఉంటాయో? పట్టణంలో ఉన్న పార్కులను ఓసారి పరిశీలిస్తే తెలుస్తుంది. అభివృద్ధి పేరుతో పట్టణంలో కోట్లాది రూపాయలు ఖర్చు చేసి శంభుని చెరువు, రామగుండం ప్రాంతాలను పార్కులుగా తీర్చిదిద్దుతున్నారు. స్వల్ప ఖర్చుతో శుభ్రం అయ్యే రిజర్వ్ స్థలాల్లో పార్కులపై అధికారులు శ్రద్ధ చూపించడం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ఉన్న కొన్ని పార్కులను పరిశీలిస్తే అచ్చుగట్లపాలెం పాత బ్యాంక్ కాలనీలో పార్కు చెత్తతో నిండిపోయింది. ఇందులో పాములు కూడా సంచరిస్తున్నాయని కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. లజపతిరాయ్‌పేట సీవీ రాజు మునిసిపల్ పార్కు ఎలా ఉన్నా పార్కు చుట్టూ పరిసరాలు అత్యంత దుర్గంధం వెదజల్లుతూ ఉంటుంది. ఈ పార్కులో ఎక్కడ బాగుంటే పిల్లలు అక్కడే ఆడుకుంటున్నారు. అత్యం చినసీతారామయ్య, సుబ్రహ్మణ్యం మునిసిపల్ పార్కులో చుట్టూ వాకింగ్ ట్రాక్ కూడా ఉంది. అయినా ఉపయోగంలో లేకుండా పోయింది.

పాములతో నిత్యం నరకం

పట్టణంలోని బీఆర్ఎంవీ హైస్కూల్ పక్కన ఉన్న పార్కు, అల్లు వెంకట సత్యనారాయణ కాలనీలో మునిసిపల్ పార్కు, లక్ష్మీనగర్‌లో ఉన్న పార్కు ఇలా పట్టణంలో కొన్ని పార్కులు అడవిలా ఉండడంతో పాములు చెట్లపై నుంచి కింద పడి ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పార్కుల్లో గోడ పక్కనున్న చెత్తను మొక్కలు, పొద వాటి చెట్లను తొలగించాలని కోరుతున్నారు. రూ.వేలల్లో ఖర్చు చేస్తే శుభ్రం అయ్యే మునిసిపల్ పార్కులపై అధికారులు దృష్టి పెట్టాలని ఈ పార్కుల ప్రాంతంలో నివాసం ఉంటున్న స్థానికులు కోరుకుంటున్నారు. పార్కులు శుభ్రంగా ఉంటే సాయంత్రం పూట కాసేపు సరదాగా గడపడానికి వాకింగ్ చేయడానికి ఉపయోగపడతాయని వాకర్స్, వృద్ధులు, స్థానికులు కోరుతున్నారు. వేసవికాలం కావడంతో విష సర్పాలు, విష పురుగులు వేడికి బయటకు రావడం వల్ల దగ్గర్లో ఉన్న ఇళ్లల్లోకి వచ్చేస్తున్నాయని, మునిసిపల్ అధికారులు వెంటనే స్పందించి పట్టణంలో పలు వార్డుల్లో ఉన్న పార్కులను శుభ్రం చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా పార్కులు



పట్టణంలో పార్కులన్నీ అధ్వాన్నంగా ఉన్నాయి. వాటిని శుభ్రం చేసి మొక్కలు నాటి, వాకింగ్ ట్రాక్‌లు, బల్లలు ఏర్పాటుచేస్తే స్థానిక ప్రజలు, వృద్ధులు, చిన్నారులకు ఆట స్థలంగా బాగుంటుంది. మునిసిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పట్టణంలో ఉన్న పార్కులను బాగుచేయాలి.

– వేంద్ర సురేష్, స్థానికుడు, పాత బ్యాంక్ కాలనీ

అధికారులు శ్రద్ధ పెట్టాలి



పట్టణంలో ఎన్ని పార్కులు ఉన్నా కాసేపు సరదాగా నలుగురితో కలిసి కూర్చుని టైంపాస్ చేయడానికి ఒక్క పార్కు కూడా ఉపయోగకరంగా లేదు. వేసవికాలంలో సాయంత్రం సమయంలో చల్లని గాలిలో సరదాగా గడపడానికి ఎంతగానో ఉపయోగపడతాయి. ఇళ్ల దగ్గర్లో ఉంటే మహిళలు వాకింగ్‌లు చేయడానికి ఉపయోగకరంగా ఉంటాయి. అధికారులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే బాగుంటుంది.

– ఉప్పే పండు, స్థానికుడు, లజపతిరాయ్ పేట

నేటి నుంచి నరసాపురంలో స్పెషల్ ఆధార్ క్యాంపులు

నరసాపురం: పట్టణంలో స్పెషల్ ఆధార్ క్యాంపులు బుధవారం నుంచి ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 22 వరకూ శ్రీహరిపేట, టేలర్‌పేట, వీవర్స్ కాలనీ సచివాలయాల వద్ద, అలాగే ఈ నెల 25 నుంచి 28వతేదీ వరకూ కోటవద్దపాలెం, అధికారి వారివీధి, మృత్యుంజయనగర్ సచివాలయాల వద్ద ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ క్యాంపులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలు వరకూ పని చేస్తాయని చెప్పారు. ఆధార్‌లో తప్పులు సరిచేసుకోవడం, మార్పులు, చేర్పులు, చిన్నపిల్లల ఆధార్ నమోదు, కొత్తగా ఆధార్‌కార్డులు పొందాలని అనుకునే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

క్లబ్‌ల తనిఖీ

పాలకొల్లు సెంట్రల్: క్లబ్‌ల్లో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పట్టణ సీఐ కె. రజనీకుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో ఉన్న కాస్మో క్లబ్, టౌన్ హాల్‌లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ రజనీకుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, ఆదేశాల ప్రకారం డీఎస్పీ పర్యవేక్షణలో తనిఖీలు నిర్వహించామన్నారు. ఈ తనికీల్లో ఎస్సైలు జె.ప్రసాద్, జి.పృథ్వీ, ఏఎస్సై మార్‌లింగం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందిస్తున్న సతీష్

పాలకొల్లు సెంట్రల్: ఆర్థిక ఇబ్బందుల వల్ల విద్య, వైద్యానికి ఇబ్బందులు పడుతున్న పేద వారిని ఆదుకోవడంలో రోటరీ క్లబ్ తన సహాయ సహకారాలు అందిస్తుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడుఏ రావాడ సతీష్ అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆచంట మండలం పెనుమంచిలి గ్రామానికి చెందిన గందం నాగరాజుకు ట్రై సైకిల్‌ను అందించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నాగరాజు పోలియో వల్ల నడవలేని స్థితిలో ఉన్నాడని అతనికి ట్రై సైకిల్ కావాలని కోరడంతో రూ.12 వేలు విలువ చేసే ట్రై సైకిల్‌ను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పీర్ సాహెబ్, కావలి నగేష్, జక్కంపూడి రాంప్రసాద్, కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్పోత్సవం



ప్రత్యేకాలంకరణలో కనకదుర్గమ్మ

పాలకొల్లు సెంట్రల్: స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి ఏకాంతసేవ, శ్రీ పుష్పోత్సవం కార్యక్రమంతో ఉత్సవాలు ముగించారు. ఉదయం వేద పండితులు వేద పారాయణం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారికి పుష్పోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి స్వీట్లు, పండ్లు, పూలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రధానార్చకులు మోగంటి వెంకటరమణ శర్మ, సీహెచ్ రాంబాబు, కె.సత్యనారాయణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్తమ నాటిక ప్రదర్శనగా 'చిగురు మేఘం'



ఉత్తమ ప్రదర్శన బహుమతి అందుకుంటున్న చిగురు మేఘం నటులు

పాలకొల్లు సెంట్రల్: కళాకారులు తమ నటనలో ఎంత గొప్పగా ప్రదర్శనలు చేసినా ఆ కళలను అభిమానించే కళాభిమానులు ఉంటేనే నటించిన కళకు గుర్తింపు ఉంటుందని పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ అన్నారు. సోమవారం రాత్రి ముగిసిన పాలకొల్లు కళాపరిషత్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా చిగురు మేఘం నిలిచింది. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ సినిమాల్లో నటించడమే సులభమని అక్కడ సీన్ రక్తికట్టించే వరకూ అనేక టేకింగ్‌లు తీసుకోవచ్చని అన్నారు. నాటిక ప్రదర్శనలు అలా కాదని ఒకసారి రంగంలోకి దిగిన తరువాత తప్పు సరిదిద్దుకోవడానికి అవకాశం ఉండదన్నారు. ఈ ప్రదర్శనలకు ఎంతో గొప్ప నటనాచాతుర్యం ఉండాలన్నారు. మూడు రోజులు పాటు జరిగిన కళాపరిషత్ నాటిక పోటీలు సోమవారం ఘనంగా ముగించారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అసత్యం, తృతీయ ప్రదర్శన కిడ్నాప్ నాటికలు గెలుపొందాయి. జ్యూరీ ప్రదర్శన బ్రహ్మస్వరూపం నాటిక ఎంపికైంది. ఉత్తమ రచయితగా వల్లూరి శివప్రసాద్ విడాకులు కావాలి, ఉత్తమ దర్శకుడిగా పి.బాలాజీ నాయక్ అసత్యం, ఉత్తమ నటుడు కావూరి సత్యనారాయణ, చిగురు మేఘం, ఉత్తమ నటి బి.నాగమణి, ఇది రహదారి కాదు, ఉత్తమ ప్రతినాయకుడు వై.అనిల్‌కుమార్, అసత్యం, ఉత్తమ హాస్య నటుడిగా పి.పండు మా ఇంట్లో మహాభారతం, ఉత్తమ రంగాలంకరణ బ్రహ్మస్వరూపం, ఉత్తమ సంగీత దర్శకుడిగా అసత్యం నాటికతో పాటు వివిధ టగిరిల్లో కళాకారులు మరిన్ని బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మానాపురం సత్యనారాయణ, వితాకుల రమణ, డాక్టర్ వర్మ, సినీ దర్శకుడుగరాపి వెంకటరమణ, తాడేపల్లిగూడెం కళాపరిషత్ అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు, మేడికొండ శ్రీనివాసు, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను నిలిపి వేయాలి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దళిత సంఘ నాయకులు

నరసాపురం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కూటమి ప్రభుత్వం బిల్లు తీసుకురావడాన్ని నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆందోళన చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కూటమి ప్రభుత్వం ముందు కెళ్లకూడదని డిమాండ్ చేశారు. ఈ విషయంలో భవిష్యత్‌లో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఇంజేటి జాన్ కెనడీ, సోడదాసి శ్రీధర్, దొండపాటి స్వాములు, కాకిలేటి ఆనంద్, అడిదల శరత్, కొల్లాబత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరుగుదల



మేడపాడులో మాట్లాడుతున్న ఈద అనిల కుమారి

యలమంచిలి: భూతాపం తగ్గాలన్నా, భూసారం పెరగాలన్నా, మనం తినే ఆహారం ఆరోగ్యాన్ని ఇవ్వాలన్నా రైతులంతా తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని నరసాపురం ప్రాంతీయ సహాయ వ్యవసాయ సహాయకులు ఈద అనిల కుమారి కోరారు. మేడపాడు రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతపై మండల స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రసాయనిక ఎరువుల వల్ల భూసారం బాగా తగ్గిపోయిందన్నారు. ఆ భూములను మళ్లీ సారవంతం చేయడానికి మళ్లీ రైతులంతా ప్రకృతి వ్యవసాయ చేయాలని అమె కోరారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కో–ఆర్డినేటర్ అరుణ కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుమారు 12 కిలోల బరువున్న నవధాన్యాల విత్తనాల కిట్‌ను రూ.850లకే అందజేస్తున్నట్లు ఆమె వివరించారు. ఈ కిట్‌లో 16 రకాల విత్తనాలు ఉంటాయన్నారు. ఇలా మిశ్రమ విత్తనాల సాగు వల్ల భూమిలో జీవ వైవిధ్యం పెరిగి భూమి సారవంతమవుతుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి, వెలుగు ఏపీఎం సతీష్ కుమార్, ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి అప్పారావు, సిబ్బంది జ్యోతి, జడ్డు లక్ష్మీనారాయణ, బండి లక్ష్మీదుర్గ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు



డ్రెయినేజీపై ఉన్న ఆక్రమణలు తొలగించాలని సూచిస్తున్న కమిషనర్ విజయసారథి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణకు అడ్డంకిగా మారిన డ్రెయిన్లపై ఆక్రమణలను మంగళవారం మున్సిపల్ విజయసారథి ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. పట్టణంలో డ్రెయిన్లపై ఆక్రమణలు ఉండడంతో కార్మికులకు డ్రెయిన్లను శుభ్రం చేయడం చాలా కష్టంగా ఉంటుంది. వీలైనంత మేరకే డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులను చేపట్టడంతో భారీగా సిల్ట్ పేరుకుపోతుంది. తద్వారా మురుగు సమస్య అధికం అవుతుంది. మురుగునీరు పారుదల లేక కొద్దిపాటి వర్షం వస్తే రోడ్లపైకి మురుగునీరు చేరిపోతుంది. అందువల్ల ప్రత్యేక డ్రైవ్ చేపెట్టిన మునిసిపల్ కమిషనర్ మార్కెటింగ్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న ఆక్రమణలు తొలగించాలని వ్యాపారస్తులకు సూచించారు. తమకు తాముగా ఆక్రమణలు తొలగించుకోమని చెబుతున్నారు. వినని పక్షంలో మునిసిపల్ సిబ్బందితో తొలగింపు పనులను చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా కోర్టు ఎదురుగా ఉన్న మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఆక్రమణలను తొలగించి సిల్ట్ తొలగింపు పనులు చేపట్టారు. మార్కెట్ యార్డు దక్షిణం భాగంలో ఉన్న ఆ ఒక్క డ్రెయినేజీలో సిల్ట్ తీయగా సుమారు పది ట్రాక్టర్లు మట్టి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ డీఈ రాజ్‌కుమార్, టీపీఓ వీరబ్రహ్మం, ఏఈ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



యలమంచిలి: కంచుస్తంభంపాలెంలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న చంద్రశేఖరరెడ్డి



పెనుగొండ: గోశాలలో టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న పశువైద్య సిబ్బంది

యలమంచిలి: మండలంలోని కంచుస్తంభంపాలెం గ్రామంలో మంగళవారం పశు సంవర్ధక శాఖ అధికారులు పశు వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో పశు వైద్య సిబ్బంది 24 ఆవులు, 152 గేదెలకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా టీకాలు వేశారు. ఈ శిబిరం బుధవారం కనకాయలంక, పెదలంక గ్రామాలలో నిర్వహిస్తామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పెనుగొండ: జాతీయ గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ తాడేపల్లిగూడెం ఉప సంచాలకుడు డాక్టర్ ఎల్‌కే సుధాకర్ అన్నారు. మంగళవారం పెనుగొండలోని గోశాలలో ఆవులకు టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ నెల 30 వరకూ టీకాల కార్యక్రమం కొనసాగుతుందన్నారు. రైతుల వద్దకే పశు సంవర్ధక శాఖ సిబ్బంది వెళ్లి టీకాలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం. ప్రమీలా రాణి పాల్గొన్నారు.

భక్తాంజనేయుడికి ప్రత్యేక పూజలు





పెనుగొండ: రామన్నపాలెంలో ఆంజనేయుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం,
యలమంచిలి: ప్రత్యేకాలంకరణలో భక్తాంజనేయస్వామి →

యలమంచిలి: పాల్గుణ శుద్ధ చవితి సందర్భంగా స్థానిక మంచినీటి చెరువు గట్టున ఉన్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి వెంకటరాజ గోపాలకృష్ణమాచార్యులు బ్రహ్మత్వంలో ఆంజనేయస్వామికి వట్టి వేరు, బంతి, చామంతి పువ్వులతో పుష్పాభిషేకం, తమలపాకులు, గంగ సింధూరంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా గ్రామోత్సవం

పెనుగొండ: రామన్నపాలెంలో భక్తాంజనేయ స్వామి 67వ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి స్వామి వారికి గంధ సింధూరం, తమలపాకులతో సహస్రనామార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయ మేళతాళాలతో గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు.

జెడ్పీ పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి మండవిల్లి హరిప్రసాద్ రూ.80 వేలు విలువ చేసే సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కేవీఎస్ ప్రసాద్‌కు సౌండ్‌సిస్టమ్ అందించారు. 13 తరగతి గదుల్లో 13 స్పీకర్లు అమర్చేవిధంగా అధునాతన సౌండ్ సిస్టమ్‌ను పాఠశాలలో ఏర్పాటు చేశారు. అలాగే పాఠశాలకు ఫర్నిచర్ సమకూర్చడం కోసం మరో రూ.25 వేలు అందించారు. పూర్వ విద్యార్థి హరిప్రసాద్‌కు పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్య బాధితులకు సాయం



అనారోగ్య బాధితులకు నగదు అందిస్తున్న గాంధీరాజు

పాలకొల్లు సెంట్రల్: పట్టణ కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో అనారోగ్య బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేశారు. మంగళవారం కాస్మో కాంప్లెక్స్‌లో పోడూరు మండలం కొమ్ముచిక్కాల గ్రామానికి చెందిన వై సుబ్బలక్ష్మికి రూ. 10 వేలు, నరసాపురం మండలం దర్బరేవు గ్రామానికి చెందిన పద్మావతి భర్త అనారోగ్యంతో ఉండడంతో ఆమెకు రూ. 10 వేలు నగదు అందజేశారు. కాస్మో అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, సెక్రటరీ వేగిరాజు సోమరాజు, చేకూరి సూరిబాబు, డాక్టర్ వర్మ, కనుమూరి రామకృష్ణంరాజు, డీటీడీసీ బాబు, పి.బుద్ధరాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

నరసాపురం డివిజన్
90102 23729 (పాలకొల్లు)
95055 07552 (పాలకొల్లు)
90102 23729 (ఆచంట)
95055 07552 (నరసాపురం)
Office mail : tpgadvt@gmail.com